క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులకు బ్రేక్

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన కారణంగా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణను నిలిపివేస్తున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఖేడ్ నియోజకవర్గంలోని బాధితులు ఈ విషయాన్ని గమనించి కోడ్ ముగిశాక దరఖాస్తులను అందజేయాలని సూచించింది.

రైతులను ఆదుకోవాలి

నారాయణఖేడ్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు చేతికి వస్తున్న తరుణంలో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ సహాయంగా ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని అందించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పారిశ్రామికవేత్తలు, ప్రజలు సహకరించాలని కోరారు.

సర్వే పనులు ముమ్మరం


సర్వే చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్–నిజాంపేట్– బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణం పనులకు సంబంధించి చివరి సర్వే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. నిజాంపేట్ నుంచి బీదర్ వరకు 45 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.521 కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులకు సంబంధించిన టెండర్లను ఆర్‌ఎంఎన్ ఏజెన్సీ దక్కించుకుంది. త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నందునా తుది సర్వే పనులను ముమ్మరం చేశారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మన్‌సాపల్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయ 7వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అలయ నిర్వాహకులు అంతారం కాదులూరి లక్ష్మీనర్సింహగౌడ్ గణపతి పూజను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 21న ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగు సరికాదు


మాట్లాడుతున్న సంతోష్

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల కోడ్ పేరిట అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగులు వేయడం సరికాదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ తెలిపారు. ఖేడ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాజకీయాలకు అతీతుడన్నారు. జిల్లాలోని అనేకచోట్ల అంబేడ్కర్‌తో పాటు స్వామి వివేకానంద, భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు సైతం ముసుగులు వేయడం సరికాదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు నితిన్, సుభాష్, అఖిల్, జోసెఫ్, సీమోన్, బస్వరాజ్ పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేకాధికారి హరినందన్‌రావు అధ్వర్యంలో తైబజార్ వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ఉదయం 10.30 గంటలకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

మిగిలింది 10 రోజులే!


జహీరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

జహీరాబాద్ మున్సిపాలిటీకి ఇచ్చిన ఆస్తిపన్ను వసూలు లక్ష్యం మేరకు పూర్తి కావడంలేదు. ఇంకా 10రోజులే గడువు ఉంది. ఈ లోగా రూ.2 కోట్ల మేర పన్నులు వసూలు చేయాల్సి ఉండగా మొండి బకాయిలు రూ.3.50 కోట్ల వరకు ఉన్నాయి. గడువు దగ్గర పడుతుండటంతో 100శాతం పన్ను వసూలు అనుమానంగానే ఉంది. ఈ నెల 31తో గడువు ముగిస్తుండటంతో పన్ను వసూలుకు మున్సిపాలిటీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్

- 100 శాతం పన్నుల వసూలు అనుమానమే!
- పెండింగ్‌లో రూ.2కోట్ల ఇంటి పన్నులు
- చెల్లింపులకు సహకరించాలని మున్సిపల్ అధికారుల విజ్ఞప్తి

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో 24 వార్డులు ఉండగా 5 గ్రామ పంచాయతీలు ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైయ్యాయి. దీంతో వార్డుల సంఖ్య 37కు పెరిగింది. లక్షకు పైగా జనాభా కలిగిన మున్సిపాలిటీలో ఇళ్లు, వ్యాపార సంస్థలు 2800పైగా ఉన్నాయి. పట్టణ విస్తీర్ణంతో పాటు ప్రతి సంవత్సరం నూతన నిర్మాణాలు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రతి ఏడాది ఆస్తిపన్ను కూడా పెరుగుతోంది. ఇళ్లు, వ్యాపార సంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు కలిపి 2023–24 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్‌కు ఇంటిపన్ను రూ.6.80 కోట్లు డిమాండ్ ఉంది.

రెండు టీంల ఏర్పాటు

ఇంటిపన్ను వసూలుకు మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక ప్రణాళికలు చేపట్టారు. 8మంది బిల్ కలెక్టర్‌లు కలుపుకొని 2 టీంలను ఏర్పాటు చేశారు. ఏరియాను బట్టి టార్గెట్‌ను నిర్ధారించి అధికారులు వీరిని వసూళ్లకు పంపుతున్నారు. అంతేకాకుండా ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజు పట్టణంలో పన్నులు చెల్లించాలని సూచిస్తున్నారు. అయినా ఆశించిన మేరకు ఆస్తిపన్నులు వసూలు కావడంలేదు. గడువు ఇంకా 10రోజులే మిగిలి ఉన్నందునా 100శాతం వసూలు అసాధ్యమని కొందరు భావిస్తున్నారు. మొండి బకాయిలు సైతం పేరుకుపోయాయి. వాటిని వసూల్ చేసేందుకు మున్సిపల్ అధికారులు వడ్డీలో 90 శాతం రాయితీ ప్రకటించారు. వడ్డీలో కేవలం 10శాతం చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినా ఇప్పటివరకు 60 శాతం దాటలేదు. పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఇంటి పన్నులు 100శాతం వసూలు కష్టమని అధికారులు అంటున్నారు.

అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం



ఆస్తి(ఇంటి) పన్ను వసూలుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రచారం వాహనంతో ప్రతిరోజు పట్టణంలో చాటింపు వేయిస్తున్నాం. ప్రజలు పూర్తిగా సహకరించి పన్నులు చెల్లించాలి. మొండి బకాయిలు ఉన్న వారికి 90శాతం వడ్డీలో రాయితీ కల్పించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్, జహీరాబాద్

నాణ్యతా లోపం.. ప్రయాణికులకు శాపం

- గుంతలమయంగా బీటీ రోడ్డు నిర్మాణం
- నెల రోజులు గడవకముందే కంకర తేలిన వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- కన్నెత్తి చూడని అధికారులు


హత్నూరలో కంకర తేలిన బీటీ రోడ్డు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీటీ రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడంతో పూర్తిగా కంకర తేలి గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రమైన హత్నూర, సిరిపుర, దౌలాపూర్, సికిందలపూర్, గోవిందరాజ్‌పల్లి తదితర గ్రామాల తారు రోడ్లపై గుంతలు ఏర్పడడంతో ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టు పనులు దక్కించుకున్న గుత్తేదారు తారు రోడ్డుపై పడిన గుంతలు పూడ్చేందుకు కంకర, డస్టు పోసి కొన్నిచోట్ల డాంబర్ వేసి మరికొన్ని చోట్ల వేయకుండా చేతులు దులుపుకున్నాడు. దీంతో పూడ్చిన గుంతలు మళ్లీ గుంతలమయంగా మారడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

అధికారుల పర్యవేక్షణ కరువు

పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపడుతుండటంతో అవస్థలు తప్పడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఓవైపు అధికారుల నిర్లక్ష్యం, మరోవైపు కాంట్రాక్టర్ నిర్వాకంతో ప్రజాధనం వృథా అవుతోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులను నాణ్యతగా చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలి


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

- ఓటరు చైతన్యంపై యువత దృష్టి సారించాలి
- హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

సంగారెడ్డి టౌన్: ఓటర్ చైతన్యంపై యువత దృష్టి సారించి సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సంగారెడ్డిలోని గిరిజన గురుకుల న్యాయ కళాశాలలో బుధవారం నమూనా కోర్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందరికీ ఓటుహక్కు కల్పించారన్నారు. ఎన్నికల్లో సమర్థులైన నాయకులను ఎన్నుకొని దేశ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. విద్యార్థులు న్యాయశాస్త్రంలో పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిరీక్షణరావు, సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల న్యాయ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూర్, యెట్టిగడ్డ సంఘం గ్రామాల్లో బుధవారం పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో అనేక మార్పులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర సాఫ్ట్‌వేర్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని పనుల్లో అనేక మార్పులను చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 8 వారాలుగా కూలీలు పనిచేస్తే 15 రోజుల లోపు ఇవ్వాల్సిన కూలిడబ్బులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సంవత్సరంలో 200 రోజుల పనిదినాలు, రోజు కూలి రూ.800 చెల్లించాలన్నారు. ఉపాధిహామీ బకాయిలు చెల్లించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంగయ్య, సుశీల, దశరథ్, లక్ష్మయ్య, నాగమణి, బాలమణి, సంజీవులు, అంజమ్మ, మల్లేశం, శివమ్మ, బుచ్చయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బాబురావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను బుధవారం నారాయణఖేడ్‌లోని ఆ సంఘ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనంగా రూ.28,223 అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సతీష్, రాజు, కుమార్, చంద్రకళ, శకుంతల, రవి, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


రాంచందర్‌కు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మూఢ రాంచందర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాంచందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ దారంశంకర్, వినోద్‌పటేల్, రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్


నియామక పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024–25 సంవత్సరానికి గాను నూతన బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా చంద్రశేఖర్ పాటిల్, విజయ్‌కుమార్‌లు వ్యవహరించారు. అధ్యక్షుడిగా న్యాయవాది గోపాల్, ఉపాధ్యక్షుడిగా మాణిక్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా గోపాలకృష్ణ, కోశాధికారిగా గోపాల్ ముదిరాజ్, జాయింట్ సెక్రటరీగా సోమ శేఖర్, లైబ్రేరియన్‌గా కార్తీక్‌గౌడ్, సభ్యులుగా అనూష, బుజ్జమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నియామకం


రాజుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

పటాన్‌చెరు: బీజేపీ అమీన్‌పూర్ మండల అధ్యక్షుడిగా ఈర్ల రాజు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలో బీజేపీ కార్యాలయంలో ఈర్ల రాజుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి బుధవారం నియామకపత్రం అందజేశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు మణికంఠచారికి కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని డాకూర్, బ్రహ్మణపల్లి గ్రామాల్లో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ రైతులు ఒకే పంట కాకుండా సమగ్ర వ్యవసాయం చేస్తూ సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళిక ప్రాంతం, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు చీడపీడల నివారణకు అనుసరిస్తున్న మొదలగు అంశాలపై చార్టు ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సరిత, వ్యవసాయాధికారి విజయరత్న, ఏఈఓలు శ్రీనివాస్, శ్రీకర్, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించండి


పెద్దకంజర్లలో గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పటాన్‌చెరుటౌన్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పటాన్‌చెరు మండల పశువైద్యాధికారి శైలేంద్రజస్వాల్ అన్నారు. మండల పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో 526 పశువులకు బుధవారం గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శైలేంద్రజస్వాల్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో ముందస్తుగా ఈ టీకాలు వేయడంతో వ్యాధి రాకుండా అడ్డుకోవచ్చన్నారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ ఉచిత టీకాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సర్దార్ శ్రావణ్, సులోచన, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బండ్లగూడలో..

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. ఈ శిబిరంలో 150 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి వంశీకృష్ణరెడ్డి, సిబ్బంది సరిత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మల్లికార్జున స్వామి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా స్వామివారికి స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డి, యాదవ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వరకు నిర్వహించే రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అంజయ్య, గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ



రైతులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలానికి చెందిన 30 మంది రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. డీడీఎస్, కేవీకే, ఐసీఏఆర్ సహకారంతో నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణలో రైతులకు మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్షలు, సేంద్రియ ఎరువుల తయారీ, కషాయాల తయారీ, చిరుధాన్యాల సాగు, ఆరోగ్య ప్రయోజనాలు, నారుమడి పెంపకం, పశుపోషణ గురించి శాస్త్రవేత్తలు వివరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు వరప్రసాద్, కేవీకే ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ స్నేహలత, శాస్త్రవేత్తలు శైలజ, రమేష్, కై లాష్, ప్రియాంక, స్వామి, శ్రీకాంత్, శ్రీధర్, జగన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా, సిగరెట్లు స్వాధీనం

జోగిపేట(అందోల్): నిషేదిత గుట్కా, సిగరెట్లను విక్రయిస్తున్న కిరాణాషాపు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగిపేట పట్టణంలో సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు బుధవారం కిరాణాషాపులపై దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.లక్షలు విలువచేసే వివిధ రకాల బ్రాండ్లకు చెందిన నిషేధిత గుట్కా, సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దు

నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి


కొడిపల్లి పీఎస్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న సీఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంతో పాటు మండలంలోని చిన్నచింతకుంటలో మిలటరీ, పోలీసు బృందాలతో ప్రధాన రోడ్లు, వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ బాలస్వామి అధికరణకు శాంతి భద్రతల సంరక్షణ కోసం మిలిటరీ, పోలీసుల బృందాలతో కవాతు చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులతో పాటు కార్యకర్తలు, ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

గ్రామాల్లో నిఘా ఏర్పాటు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశామని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, ఇతర కేసుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. మండలంలోని కంచన్‌పల్లి, వెల్మకన్న, తిమ్మాపూర్, కొడిపల్లి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఇప్పటికే పోలీస్‌లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో గట్టినిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులకు సమస్య ఉంటే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలన్నారు. చట్టం ముందు అందరు సమానమేనని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు, వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.